## క్లుప్తంగా

### మూడోసారీ గెలుపు ఖాయం

నవాబుపేట: అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని.. వచ్చే ఎన్నికలలో హ్యాట్రిక్ ఖాయమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దరిపల్లికి చెందిన బీఎస్‌పీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్రధానకార్యదర్శి ప్రతాప్, జిల్లా నాయకులు నాగిరెడ్డి, శివ, జంగయ్య తదితరులు ఉన్నారు.

### ఇసుక టిప్పర్ల పట్టివేత

జడ్చర్ల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మండల పరిధిలోని గంగాపూర్ వద్ద జడ్చర్ల వైపు వస్తున్న టిప్పర్లను పట్టుకున్నామని వివరించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లుగా గుర్తించామని.. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### ఘన నివాళి..

గండీడ్: రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటయ్య యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. లింగాయపల్లికి చెందిన ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పని చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. వారం క్రితం కోమాలోకి వెళ్లారు. ఆస్పత్రిలో మృతిచెందారు. కాగా మృతదేహాన్ని లింగాయపల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఆయనకు ఘన నివాళి అర్పించారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

రాజాపూర్: ఎస్పీ నరసింహ దగ్గర పనిచేస్తున్న డ్రైవర్ రవి తండ్రి చెన్నయ్య బుధవారం మృతి చెందారు. దీంతో ఆయన సిబ్బందితో రాజాపూర్ వచ్చి చెన్నయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

జడ్చర్ల: జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బూరెడ్డిపల్లికి చెందిన గుండు రాకేశ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బుధవారం పరామర్శించారు. బాదేపల్లి ఆస్పత్రి వద్ద వారిని ఓదార్చారు. రాకేశ్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బీసీ రాజ్యాధికారమే ధ్యేయం



స్టేషన్ మహబూబ్‌నగర్ : బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాస్ సాగర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోకన్వీనర్లుగా ఆర్ సత్యం, రాజేంద్ర గౌడ్, దేవరకద్ర నియోజకవర్గం కన్వీనర్ గా బి. శేఖర్, మక్తల్ నియోజకవర్గ బీసీ సమాజ్ యూత్ కన్వీనర్ గా శ్యామ్ సుందర్ సాగర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ సాగర్ మాట్లాడారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ రాజ్యాధికారమే ధ్యేయంగా నూతన కార్యవర్గం పని చేయాలని, బీసీలను అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సత్యం, సభ్యులు రాజు,వెంకటేష్, బుచన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన 'గృహలక్ష్మి'!

- మొత్తం వచ్చిన దరఖాస్తులు 4,780
- 2,646 మంది అర్హులుగా గుర్తింపు
- 1,400 మంది సర్టిఫికెట్ల పునఃపరిశీలన
- ఈ పథకం కింద 1,800మంది ఎంపిక



జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారు ధ్రువపత్రాలను పునఃపరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

**ఎన్నికల షెడ్యూల్‌తో ఆగింది**

ప్రస్తుతం శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలై నియమావళి అమలులోకి వచ్చినందున గృహలక్ష్మి పథకం ఆగింది. దీనికి సంబంధించి ఈపాటికే వివిధ దశల్లో ప్రక్రియ పూర్తయింది. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే నడుచుకుంటాం.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో సొంత స్థలం కలిగిన పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.మూడు లక్షలు పూర్తి సబ్సిడీ కింద ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా వచ్చాయి. గత ఆగస్టులో వారం రోజుల పాటు మున్సిపల్ కార్యాలయంలో 4,780 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత మున్సిపల్ అధికారులు, సిబ్బంది సుమార 15 రోజుల పాటు ఆయా వార్డులకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి 2,646 మందిని అర్హులుగా గుర్తించారు. మిగిలిన 2,134 మంది దరఖాస్తులు నిబంధనల ప్రకారం లేవని పక్కన పెట్టేశారు. ఇక 20 రోజుల పాటు అర్హత కలిగిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇటీవలే ఈ ప్రక్రియ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. వారి ఆదేశాల మేరకు వాటిలో సుమారు 1,400 దరఖాస్తుదారుల వివిధ ధ్రువపత్రాలను క్షేత్రస్థాయికి వెళ్లి పునః పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని వివరాలు సరిగా ఉన్నాయా? లేదా? అనేది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే అర్హుల జాబితాను వార్డుల వారీగా మాత్రం విభజన చేపట్టకపోవడం గమనార్హం. ఈ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 1,800 మందిని ఈ పథకం కింద ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలోనే శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో ఇప్పట్లో ఈ పథకం లబ్ధిదారులకు అందే అవకాశం లేకుండా పోయింది.

## ఎన్నికల నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న అధికారులు

పాలమూరు(కోయిల్‌కొండ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు పాటించాలని తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీఓ జయరాములు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు ఉన్నతంగా ఎదగాలి



బహుమతులు అందుకున్న విజేతలు

మిడ్జిల్: అంతర్జాతీయ బాలికాదినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. బాలికలు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఉన్నతంగా ఎదగాలని.. లక్ష్యాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సృగ్నేష్, చరణ్, కరణ్‌జీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జయప్రకాష్ నారాయణ జయంతి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పాలమూరు: జయప్రకాష్ నారాయణ జయంతిని జేపీఎన్‌సీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆయన చిత్ర పటానికి కళాశాల వైస్‌చైర్మన్ సీ భాస్కర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల డైరెక్టర్ లింగాన్‌గౌడ్ కులకర్ణి, పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దత్త మందిరంలో చోరీ

జడ్చర్ల: స్థానిక సర్దార్ వల్లబాయ్ పటేల్ నగర్‌లోని దత్తాత్రేయ మందిరంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపు తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి హుండీని పగుల గొట్టారు. సొమ్మును అపహరించారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మూఢనమ్మకాలపై నిర్మూలనపై అవగాహన



ప్రదర్శన చేస్తున్న బృందం సభ్యులు

మిడ్జిల్: వాడ్యాల్‌లో బుధవారం సాయంత్రం పోలీస్ సురక్ష కళాబృందం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, సర్పంచ్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో వాగ్వాదం



సభలో వాదిస్తున్న సభ్యులు

దేవరకద్ర: ఎన్నికల కోడ్ కారణంగా దేవరకద్ర మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించకుండానే సభను ముగించారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన మండలసభ గడువు పూర్తి కానుండడంతో సభ్యుల సంతకాలు తీసుకుని ప్రారంభించారు. అయితే పేరూర్ సర్పంచ్ చామన్ సభలో వాగ్వాదానికి దిగడంతో గందర గోళ పరిస్థితి ఏర్పడింది. గ్రామ పంచాయతీకి సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే ఇతర గ్రామాల సర్పంచ్‌లకు జరిగిన అవమానాలపై నిలదీశారు. దీంతో అధికార పార్టీకి చెందిన సభ్యులు, సర్పంచ్‌లు వాగ్వివాదానికి దిగారు. ఎంపీడీఓ శ్రీనివాసులు వారికి నచ్చ జెప్పి శాంతింప జేశారు. సమావేశంలో ఎంపీపీ రమాదేవి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఇతర అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభను జయప్రదం చేయాలి



జడ్చర్ల: సీఎం కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం ఆయన సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. 18న సీఎం సభ ఉంటుందని అన్నారు. అంతకు ముందు ఆయన నివాసంలో ఎస్‌వీపీ నగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

## ఉత్సాహంగా విద్యార్థులకు స్వాగతం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫిజికల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే ఉత్సాహంగా జరిగింది. బీఎస్సీ ఫిజికల్ సైన్స్ తృతీయ, ద్వితీయ ఏడాది విద్యార్థులు మొదటి ఏడాది విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని దానిని సాధించేందుకు కష్టపడాలని పిలుపునిచ్చారు. ఏ విధంగా ఎదగాలో వివరించారు. చదువుతోపాటు కో కరికులం కార్యక్రమాల్లోనూ ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

బాలానగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో అందించే మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ తెలిపారు. వారిలో డీ నందిని, ఏ నందిని, బీ హిమ, యూ శివాని ఉన్నట్లు వివరించారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ. 10 వేల చొప్పున అందనుందని వివరించారు. అధ్యాపకులు సునీల్, వినోద్, నాగరాజ్ తదితరులతో కలిసి విద్యార్థులను అభినందించారు.

## మొక్కజొన్న క్వింటాలు రూ.2169

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం మొక్కజొన్నకు క్వింటాలు గరిష్ఠంగా రూ.2169, కనిష్ఠంగా రూ. 1509 ధర లభించింది.

## బైండోవర్

నవాబుపేట: మండలంలో ఎన్నికల నేపథ్యంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. అలాగే మండలంలో కొన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న పలువురిని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ కరుణ తెలిపారు.

## ఎమ్మెల్యేలను ప్రజాక్షేత్రంలో ఓడిస్తాం



మాట్లాడుతున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను రానున్న ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో ఓడిస్తామని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా పాలన చేసినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాల్లో పార్టీలకతీతంగా ప్రజలను భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం ఉన్నటువంటి దుర్భర పరిస్థితి లేదన్నారు. డిసెంబర్ 3న నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్యం వస్తుందన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ఫోన్ చేసి భయపెట్టాలని చూస్తే కాల్స్‌ను రికార్డు చేయాలని కోరారు. మహబూబ్‌నగర్‌కు పైపైన మేకప్‌లు చేశారని.. నిధులు దుబారా చేయడం అభివృద్ధి కాదని అన్నారు. ఎన్నికల కోడ్‌ను కలెక్టర్ నిష్పక్షపాతంగా అమలుచేయాలని కోరారు. అంతకుముందు ప్రచారం నిర్వహించారు. మాజీ మార్కెట్ చైర్మన్ అమరేందర్‌రాజు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో డీసీసీ ప్రధానకార్యదర్శి బంగ్లారవి ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బుధవారం అంబేడ్కర్ చౌరస్తా నుంచి కరపత్రాల పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారావు, రాజేష్, ఆంజనేయులు, నర్సింహులు, బాలయ్య, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. వేణుగోపాల్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముకుందం, విష్ణువర్ధన్‌రెడ్డి, ఫాల్గుణ, చంద్రయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరుపయోగంగా నీటితొట్టి



దాసర్‌పల్లి గ్రామంలో నీటితొట్టి

చిన్నచింతకుంట: పశువులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండ ప్రభుత్వం కృషి చేస్తూ రూ. కోట్లు ఖర్చు చేసి గ్రామాలల్లో నీటి తొట్లను నిర్మించింది. కానీ కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతో అవి కాస్తా నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారుతోందని పలువురు వాపోతున్నారు. చిన్నచింతకుంట మండలం దాసర్‌పల్లి గ్రామంలోనూ ఎస్సీ కాలనీలో పశువుల కోసం తాగు నీటి తొట్టిని గతంలో ఏర్పాటు చేశారు. కానీ కొన్ని రోజులుగా ఇది నిరుపయోగంగా మారింది. సిబ్బంది అందులో నీరు పట్టడం లేదు. దీంతో పశువులకు తాగించేందుకు నీరు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా అక్కడ ఏర్పాటు చేసిన నల్లా నిర్వహణ సరిగా చేపట్టడం లేదని.. దీంతో నీరు వృథాగా పోతోందని .. అక్కడి ప్రదేశమంతా బురదగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ..పశువుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఉపయోగంలోకి తీసుకువస్తే బాగుంటుందని కోరుతున్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు



నవాబుపేట/రాజాపూర్ : గురుకుంట, పల్లెగడ్డ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ ప్రధానకార్యదర్శి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయమని అందుకే ప్రతి గ్రామంలో చేరికలు ఊపందుకున్నాయన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు ప్రజలు విశ్వసిస్తున్నారని జరగబోవు ఎన్నికలలో గెలుపు ఖాయమని అన్నారు. జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, ఎంపీటీసీలు తులసీరాంనాయక్, అమ్మపూర్ నర్సింహులు, నవాజ్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

## 13 నుంచి రాష్ట్రస్థాయి ఖో-ఖో టోర్నీ



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 13 నుంచి 15 వరకు రాష్ట్రస్థాయి ఖో- పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలోని క్రీడా ప్రాంగణాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. అండర్-17 బాలురు, బాలికల ఖో-ఖో పోటీలు ఇక్కడే కొనసాగుతాయని.. రాష్ట్రంలోని అన్ని మండలాల క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. వారి వెంట ఆర్గనైజింగ్ కార్యదర్శి మన్యం , పీఈటీలు దేవేందర్, అనిల్‌కుమార్ ఉన్నారు.

# 'ఉపాధి'పై దెబ్బ కొట్టొద్దు



లింగన్నపల్లిలో కూలీల నిరసన



జడ్చర్ల.. వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పాలమూరు(హన్వాడ): మండలపరిధిలోని లింగన్నపల్లిలో బుధవారం ఉపాధిహామీ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న మట్లాడారు. కేంద్రప్రభుత్వం ఈజీఎస్ పథకాన్ని ఎత్తివేసే ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ఈనెల 3,4,5వ తేదీల్లో ఢిల్లీలో జరిగిన సదస్సులో ఆహారభద్రత, ఉపాధిహామీపై జాతీయ సదస్సు జరిగిందని ఆసదస్సులో తీసుకున్న నిర్ణయాల ప్రకారం గ్రామాల్లో కూలీలను చైతన్యం చేస్తూ కేంద్ర అవలంబిస్తున్న విధానాన్ని ప్రజలకు వివరించారు.ఈకార్యక్రమంలో టీఎస్‌యూడబ్ల్యూ నాయకులు, ఈజీఎస్ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ఉపాధి హామీ పథకాన్ని మండలంలో పకడ్బందీగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ కోరారు. బుధవారం ఎంపీడీఓ ఉమాదేవికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పేదలకు పథకం ద్వారా ఉపాధి దక్కకుండా చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పనిప్రదేశాల్లో హాజరు విధానాన్ని వెనక్కు తీసుకోవాలని, జాబ్‌కార్డుల తొలగింపు వెనక్కి తీసుకోవాలని, ఆధార్‌ప్రాతిపదికన కూలీ డబ్బులను చెల్లించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని తమ విన్నపాలను ప్రభుత్వానికి పంపించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యక్షుడు సాయిలు, బాలనాగయ్య పాల్గొన్నారు.

పాలమూరు(హన్వాడ): కేంద్రప్రభుత్వ విధానాల వల్ల ఉపాధిహామీ పథకం అబాసుపాలవుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య ఆరోపించారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ ధనుంజయ్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. పథకాన్ని రక్షించాలని కోరారు. మండల నాయకులు రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన వైనం



వెన్నాచేడ్‌లో చీరల పంపిణీ వద్ద మహిళలు

గండీడ్: ఎన్నికల కోడ్ ఉన్నా పట్టించుకోకుండా బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం మండల కేంద్రంలో అన్ని గ్రామాలకు చీరల పంపిణీ చేశారు. లబ్ధిదారులకు అందజేయాల్సిందిగా ఐకేపీ సిబ్బందిని అధికారులు ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో పంపిణీ చేయగా ..అంతలోనే సోమవారం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పంపిణీ నిలిపివేయాలని ఆదేశించారు. కానీ వెన్నచేడ్‌లో బుధవారం పంపిణీ చేపట్టారు. అంతలోనే కొందరు తమకు చీరలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీయడంతో విషయం పెద్దదైంది. పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పంపిణీ నిలిపివేశారు. విషయంపై ఐకేపీ సిబ్బందిని అడగగా ఏపీఎం ఆదేశాలమేరకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఏపీఎంను వివరణ కోరగా తాను చెప్పలేదని అన్నారు. సంబంధిత అధికారులను తెలుసుకున్నాక పంపిణీ చేద్దామని చెప్పామన్నారు. కాగా సమాచారం తెలిసిన వెంటనే చీరల పంపిణీ నిలిపివేసినట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు.